# హారం హారం

శ్రీశ్రీ

౧

(మహాభారత యుద్ధసమయం. స్థలం—కురుక్షేత్రంలో ఒక జువ్విచెట్టు. ప్రవేశం—బ్రహ్మరాక్షసుడు, బ్రహ్మరాక్షసి. భాష—పైశాచి.)

బ్రహ్మరాక్షసుడు:-అయి ప్రియే! చారుశీతలే! రోమవతీ!

బ్రహ్మరాక్షసి:-భో భో ఆర్యపుత్ర!

రాక్షసుడు:-(కళ్లలో కణకణలాడే ప్రేమాతిశయంతో) ఏం తెచ్చావో చెప్పవో.

రాక్షసి:-రక్తం, మాంసం, వస, వప...

రాక్షసుడు:-అన్నీ తీసుకురాలేదు.

రాక్షసి:-(వాగనపట్టి) రక్తం. కేవలం రక్తం. ఇంతేనా నీకు నామీద ప్రేమ?

రాక్షసుడు:-(రుధిర పూర్ణమైన ఒక కపాలాన్ని ఎత్తి చూపిస్తూ) వెర్రిదానా! ఇది సామాన్య రక్తంకాదు. ఎంత ఘాటుగా ఉందో చూడు. రుచి చూడు (సగం తాగి అందిస్తాడు. బ్రహ్మరాక్షసి పునుకను ఖాళీచేస్తుంది)

రాక్షసి:-(తెలివితేటలు ఉట్టిపడేట్టుగా) అభిమన్యుడి రక్తం!

రాక్షసుడు:-సహనావవతు. సహనౌభునక్తు.

(ఇద్దరూ కౌగిల్లో కరిగిపోతారు)

* * *

౨

(పానిపట్టు యుద్ధరంగం. పాత్రలు: మగ రాబందు, ఆడ రాబందు)

మగరాబందు:-క్రకా క్రర్ క్రి క్రి క్రీ.

ఆడరాబందు:-క్రిక్రిక్రిక్రీ క్రర్ క్రర్.

(తెనుగు తర్జుమా ప్రారంభం)

మగ:-ఇన్ని యుద్ధాల్ని చూశాం గాని ఇలాంటి యుద్ధాన్ని ఎప్పుడూ చూడలేదు.

ఆడ:-మా అవ్వ చెబుతుందికదా...

మగ:-నోరుముయ్. ముసిలిముండ దానికేం తెలుసును. నే చెబుతున్నా.

ఆడ:-కొంచెం జరుగు. అంతా నువ్వే ఆరగిస్తున్నావు.

మగ:-గడ్డాల్ని కూడా తినేస్తున్నావు. జాగ్రత్తసుమా. అజీర్ణంచేస్తుంది.

ఆడ:-(లక్ష్యపెట్టకుండా) మనకోసమే జరిగినట్టుంది ఈ యుద్ధం.

మగ:-(ఒక గొప్ప సత్యాన్ని కనిపెట్టినట్లుగా) మనలో మనం దెబ్బలాడుకోకూడదు.

(ముక్కుతో ఆడరాబందు రెక్కలోకి పొడుస్తుంది వేళాకోళానికి.)

3

(రెండవ ప్రపంచ మహాయుద్ధం. ఇండియాలో కొండొకచోట. జాతీయ యుద్ధరంగ కార్యాలయం. ప్రవేశం - దొరా, దొరసానీ.)

దొర:-స్వీటీ!

దొరసాని:-యస్, మై డార్లింగ్!

దొర:-హనీ!

దొరసాని:-యస్, డియరెస్ట్!

(కొంతసేపు సంభాషణ ఈ ధోరణిలో సాగుతుంది. ఒక నల్లటి కవి విజయగీతాల కట్టతో ప్రవేశిస్తాడు.)

కవి:-ప్రజలను ఉర్రూతలూగిస్తున్నాను. అద్భుతమైన ప్రచారం జరుగుతోంది. నాగురించి నేను చెప్పుకోకూడదు గాని...

దొర, దొరసాని:-(పార్వతీ పరమేశ్వరులలాగ కవికి కనపడుతూ) వత్సా! నీ భక్తికి మెచ్చితిమి. నీకు కావలసిన వరంబును గోరుకొనుము.

కవి:-(గబ్బిలం రెక్కలు కదుల్చుతూ, అడకువను అభినయిస్తూ,) నీ పాదకమల సేవయు నీ పాదార్చకులతోడి నెయ్యమును..(మరచిపోయి, జ్ఞాపకం తెచ్చుకోబోయి, శక్తిలేక) తాపస మందార నాకు దయసేయగదే!

దొర:-(పద్యం బోధపడక)

ఓ! దానికేం. వచ్చే జన్మదిన బిరుదావళిలో నీ పేరుండితీరుతుంది. ప్రస్తుతంమట్టుకి నీ కరువు భత్యం రెండింతలు చెయ్యడానికి సిఫారసు జరుగుతుంది.

దొరసాని:-తథాస్తు.

కవి:-ఈ దేశంలో కవులకు గౌరవంలేదని ఎవరన్నారు? (గొంతు హెచ్చించి)యుద్ధం చిరకాలం వర్ధిల్లు గాక!